సనాతన భారతీయ సంస్కృతీ ధ్యేయం వైవాహిక గృహస్థ ధర్మం!

- కె.మల్లిఖార్జున, బళ్లారి

సమాజ స్థాపన మూలాధారం కుటుంబము. కుటుంబ వ్యవస్థకు పునాది వైవాహిక ధర్మం. వైవాహిక ధర్మం స్త్రీ పురుషులు ఇద్దరూ వివాహ బంధం మూలంగా భార్యాభర్తలు అవుతారు. వీరు కలసిమెలసి సంసారయాత్రను సాగించడం హిందూ సాంప్రదాయం. ఆలుమగల మధ్య ఏర్పడిన ప్రేమానురాగాలు సంసార యాత్రను మరింత పటిష్టం చేస్తాయి. ఆలుమగల మధ్య ఏర్పడిన ప్రేమానురాగాలు సంసార యాత్రను మరింత పటిష్టం చేస్తాయి, మన సనాతన భారతీయ సంస్కృతి గృహస్థ ధర్మాన్ని మరింత ఉత్తమోత్తమ ధర్మంగా ప్రతిపాదించింది.

స్వభావరీత్యా మానవుడు సంఘజీవి. నాగరికతను అలవరచుకుని తనకంటూ ఒక గృహాన్నీ నిర్మించుకుని, ఒక కుటుంబాన్ని ఏర్పరచుకుని జీవించడం ప్రారంభించాడు.

పూర్వం 'కుటుంబం' అంటే ఉమ్మడి కుటుంబం అని అర్థం. అత్త మామలూ, ఆడపడుచులూ, బావమరుదులూ, తోడికోడళ్లూ, కొడుకులు, కోడళ్లూ, మనుమలూ, మనమరాళ్లూ కలసి మూడు నాలుగు తరాలకు చెందిన వ్యక్తులు ఉమ్మడిగా జీవించడాన్ని 'ఉమ్మడి కుటుంబం' అన్నారు. ఉమ్మడి కుటుంబంలో ఉమ్మడిగా జీవిస్తూ "కలసి ఉంటే కలదు సుఖం" అనే ధర్మతత్వాన్ని తెలుసుకుంటాం. ఇటువంటి కుటుంబాలలో పిల్లలకు, వృద్ధులకు ఎంతో భద్రత ఉంటుంది. కానీ ఈ నవీన జీవితంలో "ఎవరికి వారే యమునాతీరే" అనే భావనతో వేర్వేరుగా జీవిస్తున్నారు. అందుకే నేటి సమాజంలో అనాధ శరణాలయాలు, వృద్ధ ఆశ్రమాలు విపరీతంగా వెలిశాయి. కానీ నేడు కుటుంబం అంటే భర్త, భార్య, బిడ్డ" అనే సంక్షిప్త కుటుంబంగా ఉంటున్నారు. ఈ కుటుంబాన్ని "వైయక్తిక కుటుంబం" అని అంటారు. ఈనాడు జనపదాల్లో సైతం, పట్టణ నాగరికత వ్యామోహం వల్ల ఉమ్మడి కుటుంబాలు క్రమేణా అంతరించిపోయే స్థితి కలుగచేసింది. విశ్వమానవ సౌభాగ్యానికి కుటుంబం సంక్షేమమే ప్రాతిపదిక. కుటుంబ సామరస్యము, అనుకూలమైన దాంపత్యము, సత్సంతాన సౌభాగ్యము అనే ఈ మూడు లభించిన కుటుంబం గృహమే కదా 'స్వర్గసీమ' అన్నారు అనుభవజ్ఞులైన పెద్దలు.

కుటుంబ పరిపోషణార్థమై మానవుడు అనేక వృత్తులను అవలంభిస్తున్నాడు. అట్టి మానవుడిని 'కుటుంబీకుడు' అని అంటారు. అతడిని గృహస్థుడు అని కూడా అంటారు. కుటుంబ బాధ్యతలను స్వీకరించే స్త్రీని సద్గుణ గృహిణి అన్నారు.

'సంక్షేమం' అనే పదానికి అభ్యుదయం, అభివృద్ధి, అభ్యున్నతి, శ్రేయస్సు, మేలు అని అనేక అర్థాలు ఉన్నాయి. గృహము అనే సంక్షేమ సామ్రాజ్యానికి గృహిణియే సర్వాధికారిణి. 'భార్యామూలమిదమ్ గృహమ్' అని ప్రసిద్ధ సంస్కృతోక్తి కలదు. 'ఇంటికి దీపం ఇల్లాలే, ఇంటిని చూసి ఇల్లాలిని చూడు' అనే నానుడులు, కుటుంబములో ఇల్లాలి యొక్క ప్రాముఖ్యాన్ని తెలియజేస్తాయి. గృహిణి తల్లిగా, సహోదరిగా, కన్నకూతురిగా, సహధర్మచారిణిగా విశ్వరూపం యావత్తూ, అందరికీ అనురాగాన్ని, ప్రేమని పంచిపెడుతుంది. 'మహీం లాతీతి మహిళ' - భూమిని నిగ్రహించేది, చేపట్టేది మహిళ అని మహిళ శబ్దానికి వ్యుత్పత్తి అర్థాలున్నాయి. "క్షమయా ధరిత్రీ" - సహన గుణంతో మహిళ భూమాతకు సాటి.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అనే ఆర్యోక్తి కలదు. అంటే స్త్రీలు పూజింపబడుచోట దేవతలు ఆనందిస్తారని దీని భావం. మన హిందూ మతంలో స్త్రీ శక్తిస్వరూపిణి. సకల కళా సామ్రాజ్ఞి సరస్వతీదేవి, సకల సంపదలను ప్రసాదించే లక్ష్మీదేవి కూడా స్త్రీ మూర్తులే. వేదయుగంలో పురుషులతో సమానంగా వేదనాదాలలో ఆరితేరిన నారీమణులు - గార్గేయి, మైత్రేయి, కాకతీయ రుద్రమ్మ, ఝాన్సీ లక్ష్మీభాయి, మాంచాల మున్నగు ధీరవనితలు కూడా శ్రీమూర్తులే. వీరితోపాటు సీతా, సతీసావిత్రి, అనసూయాదులు సౌశీల్యాదులుగా మన మహిళలకు ఆదర్శప్రాయం.

మన భారతీయ నారీ ధర్మం. పటిష్ఠమైన వివాహవ్యవస్థ; అనుకూల దాంపత్యం, కుటుంబ సామరస్య జీవనం ప్రపంచ దేశాలకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా, మన వైవాహిక ధర్మాన్ని నిలబెట్టి, కుటుంబ వ్యవస్థను కాపాడినది మన భారతీనారీ. కుటుంబము అనే మహావృక్షానికి ఒక వేరువంటిది ఈ భారతీయ మహిళ.

శారీరకంగా స్త్రీ అబల. ఆత్మస్థైర్యంలో మాత్రం ఈమె సబల కాదు. ఈనాడు పురుషుడితో సమానంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విజ్ఞానపరంగా మరియు అనేక రంగాలలో సమర్థవంతంగా నిర్వహించగల ప్రజ్ఞాధురీణ వనిత.

మానవ జీవితంలా అపురూపమైన దశ శైశవదశ ఒకటి. ఈ శైశవ దశలో పిల్లలమీద తల్లియొక్క ప్రాముఖ్యము అధికంగా ఉంటుంది. పిల్లల శీలనిర్మాణ విషయంలో తల్లి బాధ్యత ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు అమ్మ ఒడి మొదటి బడి. ప్రేమ, సహనం, త్యాగం అదే దైవ గుణాలను అమ్మ దగ్గర నుండి పిల్లలు నేర్చుకుంటారు. కుటుంబ పరిరక్షణలో నాన్నది ప్రముఖపాత్ర.

అలాగే కుటుంబంలో తండ్రి ప్రాధాన్యత విశేషంగా ఉంటుంది. ప్రధానమైన అంతిమ నిర్ణయం తండ్రిదే. దైనందిన గృహకృత్యాలు, సంతాన పరిపోషణ, శీలపరిరక్షణవంటి కీకలమైన నిర్ణయాలను నిర్వహించే బాధ్యత మొత్తము గృహిణిదే. భర్త, పిల్లల అభ్యున్నతిని సందర్శించి, సంతోషంతో పొంగిపోతుంది. స్త్రీ పురుషుడు సాధించిన దిగ్విజయం వెనుక ఒక స్త్రీ మూర్తి హస్తముంటుందని మనకు తెలుసు.

నేడు పాశ్చాత్య నాగరికత పట్ల వ్యామోహం విపరీతమై, ఆలుమగల మధ్య సర్దుబాటు మనస్తత్వం కొరవడి విడాకుల వరకు వెళ్ళడమనే విపరీతమైన పరిస్థితి మన దేశంలో ప్రారంభమైనది.

సమాజాభ్యుదయం, దేశ ప్రగతి విషయంలో స్త్రీల యొక్క వైశిష్ట్యాన్ని గుర్తించే విధంగా ప్రపంచ దేశాలన్నీ మార్చి 8వ తేదీని మహిళా దినోత్సవాన్ని జరుపుకొన్నాయ్. భారతీయ స్త్రీ అంతర్హృదయాన్ని గృహిణీ ధర్మాన్ని ఆవిష్కరింపచేసారనే భావిస్తున్నాను. ●

ఫ్రూదోటలో కుసుమించిన ఆర్యవైశ్య సుమము-
డి.వి.సురేంద్రనాధ్‌గుప్త

అశోకా సుగంధ టాల్కమ్ ఫేస్‌పౌడర్లకు అఖిల భారత మార్కెట్‌ను తీసుకు వచ్చిన అతిరథుడు దోమా వెంకట శేషయ్య గుప్తగారు. వేపేరీలో ఆయన యిల్లు ఓ మండువా యిల్లులా ఉన్నప్పటికినీ దాశ ప్రకాశ హోటల్ అంతటి గదులు– గది గదికీ పనివాళ్ళు, సేల్స్‌మెన్‌లు, లోపలి ఇంజినీర్లు ఎందరెందరుండేవారో.

శేషయ్యగుప్తగారు ఘట్టివాడు. ఆచితూచి ఖర్చుపెట్టేవాడు. ఎవరినీ క్రెడిట్ అడిగే అలవాటు లేదు. అంత నిఖార్సయిన వ్యాపారజ్ఞుడు. పత్రికలకు అడ్వర్టయిజ్ కూడా ఇమ్మీడియేట్ పేమెంటు, అయితే బేరం చేసేవారు. కోపం వస్తే నీ బిల్లు రు 500 లు ఇవ్వను– కోర్టుకు వెళ్ళండి అని కరక్టుగా చెప్పి– రు.1,000లు పంపేవాడు. శేషయ్య గుప్తగారి మాట కరుకుగానీ, మనసు మెత్తనయినది, సమీపజ్ఞులకుగానీ అర్థం కాదు. మంచి ఆధ్యాత్మిక చింతనాపరుడు. ప్రతీ గురువారమూ తమ యింట సత్సంగం ఏర్పాటుచేసేవాడు.

శేషయ్య గుప్త గారికి ఆణిముత్యాల వంటి ముగ్గురు కుమారులూ, ఇరువురు కుమార్తెలు. మధ్యముడుగా పార్థుడు వంటి కుమారుడు సురేంద్రనాధ్‌గుప్త. అర్జునునిలా రెండు చేతులా బాణములు సంధించినట్లు రెండు పెదవులు, రెండు కనుపాపలనుంచీ జోకులు వేసుకుంటూ, కవ్విస్తూ మాట్లాడడం సురేంద్రనాధ్ ప్రజ్ఞ. దేనికీ తడుముకోడు.

శేషయ్యగుప్తగారు హాస్య ప్రయోక్తలు చేసేవారు. వారెంత సీరియస్‌గా ఉన్నప్పటికినీ–మోమున చిరునగవు చెరిగేది కాదు. వారు టాల్కమ్ పౌడర్, స్నోల పరిశ్రమలు ప్రారంభం 1934 సం॥ము విజయదశమి. విజయా కెమికల్స్ టాయిలెట్ వర్క్సు అని నామకరణం చేయడం వల్లనే, దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. వారి టాల్కం ఉత్పత్తులకు 'అశోకా' అని పేరు పెట్టిన కారణంగా – ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లోని ప్రజలు విపరీతంగా అభిమానించారు. ఇప్పటికీ అభిమానిస్తూన్నారు. 81 సం॥ముల సుదీర్ఘచరిత్రగల సంస్థచే ఉత్పత్తికాబడుతున్న సౌందర్య సాధనములు విక్రయదారులనూ, క్రయదారులనూ ఒప్పించి మెప్పించ కలుగుతున్నదంటే వారి చిత్త శుద్ధియనే చెప్పాలి. పాండ్సు, గోకుల్, యార్డీలీ, వంటి ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల పోటీలో యీ తెలుగు వైశ్య కుటుంబంలోని రెండో తరం నిలబడకలగడానికి వారి చిత్తశుద్ధి, శ్రమదమాదులేనని చెప్పాలి. దోమా వారు తప్ప–యే యితర వైశ్యులూ యీ సౌగంధికా వ్యాపారములు చేయలేదు. చేసినా రెండో తరం వారు కొన సాగించలేదు. తండ్రి వ్యాపారం ప్రారంభించిన 5 సంవత్సరాలకు సురేంద్రనాధుడు పుట్టాడు (జననం 1939 సెప్టెంబరు) ఆర్యవైశ్యులందరూ ధర్మపరులు. శేషయ్యగుప్త గారి వ్యాపారం గుణశీలం, నైతికత్వ లక్షణాలతో ప్రారంభమైంది. వ్యాపించేవాడు పరమాత్ముడు. పరమ – ఆత్ముడెవరు వ్యాపారే! ఆలా ధర్మపరంగా వ్యాపారం చేసిన వాళ్ళని వైశ్యులనుగాక ఎవరినంటారు? వారు నీతిగా వ్యాపారం చేస్తూ పుత్ర పౌత్రాదులకు కూడా శిక్షణ యిచ్చారు. నమ్మకం పుట్టనిదే అమ్మకం ఎలా జరుగుతుంది. ఆ నమ్మక అమ్మకాలకి తమవిగా తాము తక్క ఎవరూ చేయలేరని దోమా వంశం పేరు నిలబెట్టుకుంది.

ఇల్లూ, ఆఫీసు ఒకటే కాబట్టి 5 ఏండ్ల బుడతడి వయసు నుంచీ అనుభవంగల సురేంద్రనాధుడు తండ్రి కూడానే ఉంటూ పౌడర్‌లో ఇంజనీర్లు ఏ ఏ సుగంధాలను ఏ యే పరిధిలో ఎంతంత వేస్తారన్నదీ– పాఠశాలలో మేస్టరు కూడా చెప్పలేనట్లు చెప్పేవారు. శ్రేయఃకాములు తండ్రి. శ్రేయః అభిలాషి కుమారుడు– మంచి తండ్రికి మంచి బిడ్డలు పుడతారన్నది మహినున్న సత్యం– అసత్యం కాదు.

గుణములు లేని సుతుడు–గురుడు లేని విద్య
శాంతి లేని జీవి నిష్ఫలంబు!
నీతి లేని జాతి శశిలేని నిశిరాత్రి
ఉండి ఫలమదేమి ఉర్వియందు

–అన్నారు భగవాన్ సత్యసాయి. గుణమున్న సుతుడు– గురికల తండ్రి (గురువు) అపార వ్యాపార విద్య, సుఖ శాన్తిప్రదమైన జీవితము, వాణిజ్య నీతికల ఆర్యవైశ్యకులజుండు– ఎప్పుడూ ఆఘంటి పూర్ణ శశాంక వెల్తురులే– ఇన్ని ఉన్న శేషయ్య కుమార్డు గుప్తమధ్యముడు సురేంద్రనాధుడు. మాటల చమత్కృతిలో సురేంద్రుని మించిన వాడుండడు. 'అమందసుందరసుకుంద బృంద నిష్యన్దరంద పాపనానంద నితం' అంటూ 'రామరాయ విలాసం'లో భూకృతమైన స్థితి మనోగతం, స్నిగ్ధ సౌకుమారత్సంను వర్ణిస్తాడా త్రిలోకసంచారి.

సౌ॥ కనకరత్నమ్మ
సురేంద్రనాధ్ దంపతులు

అలాటి సుందర సుకుంద బృందవందిత మందారం శేషయ్య గుప్తగారి సురేంద్రుడు, కనిష్ఠకుమారుడు. సాయినాధుండిరువురు దగ్గర స్పుటంగా కనిపిస్తాయ్. మాట మంచి, చేతమంచితనం కలవారు. తండ్రి చాటు బిడ్డల్నుంచీ–వీళ్ళిరువుతోనూ ఓ నలభై అయిదు సంవత్సరాల క్రితం నుంచీ మనసునానందము గొలుపు సాకుమార్య సౌమనస్యాలకు కలవాటుపడ్డాను.

ప్రతీ స్నేహితుసందూ దివ్యత్వం ఉంటుందనీ ఆ దివ్యత్వము దేవుడు ప్రసాదించిన తొలి వరమని విశ్వసిస్తాను. సాహిత్య సాత్వికత కలవారు కొద్దిమందే ఉంటారు. వారికి పత్రికలపై పత్రికారచయితలపై ఆవ్యాజ్యానుగ్రహ భావం ఉంటుంది. అదృష్టవశాత్తూ తెలుగు ఆర్యవైశ్యుల్లో సాహిత్య సాత్విక భావం కలవారెందరో ఉన్నారు.

ఆ భావాన్ని శేషయ్య గుప్తగారు తమ కుమారుల్లో ప్రభవింపచేసారు. సెప్టెంబర్‌లో పుట్టిన వారిలో ఆ భావం యెక్కువగా ఉంటుంది. సురేంద్రనాధుడు 1939 సం॥ము సెప్టెంబర్ 28న జన్మించాడు. పాఠశాలలో చదువుకునే రోజుల్లో కూడా, స్కూలు నుంచి యింటికి వచ్చిన తరువాత ఫాక్టరీలోనూ, ఆఫీసుల్లోనూ ఉంటూ నేర్చుకోవాలి. దీన్ని విజువల్ లేదా ప్రాక్టికల్ ఎడ్యుకేషన్ అంటారు. ఈ విధానాన్ని శేషయ్య గుప్తగారెప్పుడో కుమారుల శిక్షణ కాలంలో ప్రవేశపెట్టారు.

గాకున్న 1934 సం॥ములో స్థాపించిన అశోకాటాల్కమ్ పౌడర్–కుమారుల విడివిడి భాగసామ్యంలో నిలువ కలుగుతుందా? సురేంద్ర నాధ్ గుప్త సర్కారు జిల్లాల్లో తన వ్యాపారాన్ని చూసుకుంటున్నాడు. మరో ఆర్యవైశ్య కుటుంబీకుడూ, అగరు బత్తీ, వ్యాపారవాణిజ్యుడైన శ్రీమాన్ ఏ.కె.సుబ్బయ్య చెట్టిగారి మూడవ కుమార్తె సౌ॥కనక రత్నమ్మతో 1961 సం॥ములో వివాహం జరిగింది. ఈ దంపతులకొక కుమార్డు చి॥ శ్రీరాం అతని అర్థాంగి సౌ॥ఆశారాయ్. ఇక్కడ చెప్పుకో తగ్గ విశేషము పెద్దన్నయ్య, తమ్మునికి కుమార్తెలు జన్మించారు. ఒక్క సురేంద్రనాధ్‌కు మాత్రమే మగసంతానం శ్రీరామ్, శ్రీరామ్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె (సురేంద్రనాధ్ మనమడు) అమెరికాలో ఎమ్ఎస్ చదివి, ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

సురేంద్రనాధ కుమారుడు ఇండియన్ గాస్ ఏజెన్సీ సంస్థను స్థాపించి దిగ్విజయంగా నడుపుతూండడమే గాకుండా సిరినిటీబిల్డర్స్‌ను స్థాపించి దిగ్విజయంగా వ్యాపారం నడిపిస్తున్నాడు.

మద్రాసులోని ఓ ఆర్య వైశ్య కుటుంబం– టాల్కమ్ పౌడరు సంస్థను స్థాపించడం ఓ విశేషమైతే, రెండవ తరం వారు కూడా యదావిధిగా ఆ పారిశ్రామిక సంస్థను నిర్వహిస్తూండడం మరో విశేషం.

ఇంతకూ సురేంద్రనాధుడు 60–70 దశకంలోని వయసు వాడనుకుంటున్నారంటే పొరపడినట్లే! మరో 4 సంవత్సరాల్లో 80వ పడిలోకి రానున్నాడు. లయన్స్ క్లబ్‌లో అనేక ఉన్నత పదవులు నిర్వహించాడు. 11 సంవత్సరాలుగా యోగాను అభ్యసించి, ఎందరో ముసలివాళ్ళను పడుచు వాళ్ళుగా మార్చే అశ్వనీకుమార్ పట్టం పొందాడు. తమిళ నాట మరో యోగ గురువు బాబారామ్‌దేవ్ అనాలి. 150 కేంద్రములు ఆయన శిక్షణలో నిర్వహింపబడుతున్నాయ్. నాలుగు వందల మంది శిక్షకులను తయారుచేసాడు. అలసటెరుగని మనిషి. ఆదర స్వభావం పెంచుకున్న మనిషి. అందరికీ హితుడు, మాకు స్నేహితుడు. పూర్ణాయుష్మాయుడై వర్ధిల్లాలని మనసావాచా కోరుకుంటున్నాను. ●

తిరుమల శ్రీనివాసా!
త్యాగరాజ నగర్ శ్రీనివాసుడు వయ్యావయ్యా!

నీ వుండేదా కొండపై-నేనుండేది చెన్నయ్ నేలపై-ఏ తీరుగ నిన్ను కొలుతునో నా స్వామీ-నిన్నేవేళ్ళ దర్శింతునో స్వామీ - పద్మములాంటినీ పదయుగాలను దర్శించిన తరువాతనే - చంద్రబింబము వంటి నీమోము, నీ నడుము, నీ కరాల శంఖచక్రధరములైన భుజ సొంపూ- అభయహస్తమూ చూడాలట-చూడని నేత్రాలు పాపపు నేత్రాలట - మా దినచర్య.

తిరుమల శ్రీనివాసుడూ, తిరుచానూరు అలిమేలు మంగమ్మ కొలువైన - చెన్నయ్ సేవాలయ నిలయం

వేం-కట నాధా! వెంటవెంటనే మోక్షము లిచ్చేవాడా! వృద్ధాప్యం వచ్చినపుడెట్లు దర్శించగలమయ్యా- అని ముందే ఊహించగా. చెన్నయ్ త్యాగరాజనగర్‌లోని మా తెలుగు బ్రాహ్మణుడిచ్చిన చోటుని నెలవుచేసుకున్నావు.

నిన్ను దర్శించిన ఉత్తరనిముషంలోనే అక్కడి ఆఫీసర్ మాధవరావుగారితో- అయ్యా! ఓ అయిదారు ఏండ్లలో తిరుమల శ్రీనివాసునికి త్యాగరాజనగర్ శ్రీనివాసుడు పోటీ అవుతాడండీ! అన్నాను. ఆయన ఆశ్చర్యమొందారు. ఆయన చాలామంది ఆర్యవైశ్య మిత్రుల్ని బట్టి - లో మందిరం చుట్టూ వేంకటేశ సుప్రభాతం కలిగిన నామ ఫలకాలూ, నలుగోడలపై అమర్చారు. ఇవి చేయించినది, డి.వి.సాయినాథ్ గుప్తయని జ్ఞాపకం. అప్పట్నుంచీ ఆర్యవైశ్యులూ ఎందరో భక్తులు స్వర్ణాభరణ సంశోభితుణ్ణి చేసారు. వేంకటేశ్వరుని వామభాగమున పద్మావతమ్మను నెలకొల్పారు. వెండి ఆభరణాలూ, హుండీని క్రమక్రమంగా కూర్చడంతో భక్తుల రాక పెరిగిపోయింది. దైవభక్తుడూ భగీరథుని వంటి ఆనందకుమారరెడ్డి స్థానిక పాలకమండలి అధ్యక్షుడైన తరువాత **పెరిగినాడు చూడరో హనుమంతుడూ- అన్న అన్నమయ్య కీర్తనలా వేంకటేశుని శోభ చెన్నయ్‌లో చైత్ర శోభలా వర్ధిల్లుతూ**-లక్షలాది వేంకటేశ్వర భక్తులు నిండారుగా, కనురెప్పలు మూయకుండా దర్శిస్తున్నారు.

ఆనందకుమారరెడ్డి పాలక మండలి అధ్యక్షునిగా, ప్రతాపరెడ్డి స్థానిక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, మండలి సభ్యుల్లో పి.వి.కృష్ణారావు, ఎం.వి. నారాయణ గుప్త, ఈగా వెంకటాచలం ప్రభృతులు శ్రీవారి సేవలో నిమగ్నమై తిరుమలలోని శ్రీవారి ఆలయంలో జరుగు ఉగాది ఆస్థానం పంచాంగ శ్రవణం, పూలంగి సేవ, ప్రసాద వితరణమూ చేయడమే గాకుండా శ్రీ పద్మావతమ్మ, శ్రీనివాసుని దివ్యమూర్తులను నిత్య అలంకరణలతో, స్వామివారికి ఆయా సమయాల్లో జరుపు నివేదనంతో నిష్ఠగా చేస్తున్నారు. ఒకే ప్రదేశంలో శ్రీ పద్మావతి, వేంకటేశ్వరులను దర్శించే పుణ్యభాగ్యం కలుగుతూన్నది. కొంతమంది దేవేరులకు ఆభరణములు చేయించారు. పట్టు పీతాంబరములు సమర్పించారు. స్వామివారి హుండీలో బంగారు నగలు, బంగారం సమర్పించడం చూస్తుంటే తిరుమల శ్రీనివాసునిలా త్యాగరాజ శ్రీనివాసుడు శోభిల్లుతున్నాడు. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

అమరతేజస్సీమ అమరావతి!!

అమరావతి గుహల అపురూప శిల్పాలు!
బౌద్ధ భిక్షువుల ఆరాధనాలయాలు!
ఆది 'భిక్షు'వు అమరేశ్వరుని అత్యున్నత లింగాలయం!
ఆంధ్ర వైభవ దీపిక! శతాబ్దాల చరిత్ర వీచిక!

అమరా అంటే మృతం కాని ప్రదేశం. దివిలో ఉన్న అమరావతికి దేవేంద్రుడు పాలకుడు. సురాసురులు వరప్రసాదితుడైన అమరేశ్వరుడిక్కడే వెలిశాడు. దినదినమూ, క్షణక్షణమూ కృష్ణవేణమ్మ కృష్ణవేణమ్మ అమరేశ్వరుని పాదాలని తాకుతూ పునీతమవుతూంది.

కొండ లేకపోయినా కొండంత లింగంగా వెలిసావంటూ – కృష్ణ అవతలి వొడ్డున వెలిసిన కనకదుర్గమ్మ – అమర లింగేశ్వరుణ్ని వీక్షించడానికా – అన్నట్లు ఇంద్రకీలాద్రి పర్వతమ్మీద ఎత్తుగా వెలిసింది.

విష్ణుకుండునులిక్కడే అమరావతినే రాజధానీ నగరంగా చేసుకుని పాలించారనీ, శాతవాహనులు, పల్లవులీ అమరావతీ నగర యశో విభవాన్ని పెంపు చేసారనీ ఎందరో ఆంధ్రరాజుల కది ప్రధాన నగరమని – అనేకానేక చారిత్రిక సత్యాలను చెబుతారు. గౌతమబుద్ధుడిక్కడ కాలచక్ర తంత్రాన్ని నిర్వహించాడనే చారిత్రిక సత్యం ఉంది. దలైలామా యిక్కడకు వచ్చి కాలచక్ర తంత్ర ఉత్సవాన్ని జరుపడం టిబెట్, చైనా, జపాను, శ్రీలంక, ఇండోనేషియాల్నుంచి ఎందరో బౌద్ధ భిక్షువులు రావడం ప్రస్తుతం చూశాం.



ఆచార్య నాగార్జునుడీ అమరావతీ సీమకు సంబంధించినవాడు. కృష్ణానది ప్రాజెక్టును తలపెట్టినవాడు నాగార్జునుడే! అందుకే అక్విడెట్టు డామ్ తీరాన్ని నాగార్జునుని పెట్టి నాగార్జున సాగరం అన్నారు. బుద్ధఘోషుడిక్కడ చాలాకాలం నివసించాడు. ఒక రకంగా బౌద్ధమతం దక్షిణాదిని విస్తరిల్లడానికి అమరావతే మూల కారణమైంది. అమరావతి నేలయే బౌద్ధ విస్తరణకు కారణమైంది, బౌద్ధం ప్రవర్ధిల్లి, కొండలూ, కోనలూ, సాగరాలు దాటి అన్యదేశాల్లో అనన్యంగా వర్ధిల్లుతూంది. మౌర్య చక్రవర్తులిచట అతి పెద్ద బౌద్ధ స్థూపాన్ని నిర్మించారు.

అమరావతి పూర్వ చరిత్రను పరిశీలించినప్పుడు ధాన్యకటకం, ధరణి కోటయనే పేరులను కూడా కలిగియున్నదని విశదమవుతూంది. రాజులు, రాజ్యాధికారాలు, మతాలు, మతాచార్యులిక్కడ పాదం మోపే – శకపురుషులయ్యారు. అశోక చక్రవర్తి కాలంలోని ఒక శిలాశాసనం అమరావతిలోనే లభించిందంటారు.

కొండవీటి రాజుల కాలంలో కొండవీటి రాజైన అనవేమారెడ్డి అమరేశ్వరాలయాన్ని పునరుద్ధరించినట్టూ – ఆయన అమరేశ్వరుని భక్తుడైన కారణంగా – నగరానికి అమరావతి పేరు పెట్టినట్లు కొందరు చరిత్రకారులు పేర్కొన్నారు.

పంచారామాల్లో ఒక్కటైన అమరావతి సుప్రసిద్ధ శైవక్షేత్రం. శివానుగ్రహం సీమాంధ్రకు బాగా అవసరం. తొలి తెలుగు రాజులైన శాతవాహనులకు రాజధానిగా ఉండేది. మౌర్య చక్రవర్తుల కాలంలో ఇక్కడ అతి పెద్ద బౌద్ధస్థూపాన్ని నిర్మించారు. శ్రీశైలానికి ఈశాన్యంగా ఈ పట్టణం ఉంది. ఇది మండల కేంద్రం. అమరేశ్వరం ప్రస్తావన స్కాంద పురాణంలో ఉంది. అదే ఆలయాన్ని 1786లో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఇక్కడ ఒక నగరాన్ని నిర్మించారు. ఆ ఆలయంలో శివలింగం రెండు అంతస్తులకు విస్తరించి ఉంది. పౌరాణిక గాథల ప్రకారం ఈ శివలింగాన్ని ఇంద్రుడు ప్రతిష్ఠించాడు. ఈ ఆలయాన్ని పౌరాణిక కాలంలో యక్షులు, కిన్నెరలు సందర్శించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రస్తుతం ఈ ఆలయంలో శివలింగాన్ని భక్తులు రెండవ అంతస్తు నుంచే సందర్శించేందుకు వీలుంది. ఇక్కడ కృష్ణా నది వాయవ్య దిశగా పయనిస్తుంది. పరీవాహక ప్రాంతం అంతా తూర్పు, పశ్చిమ దిశల్లో విస్తరించి ఉంది.

అమరావతిలోని శివలింగంపై ఎర్రటి చారిక ఉంటుంది. ఇందుకొక కథ ప్రచారంలో ఉంది. ఇక్కడి శివలింగం ఎప్పటికప్పుడు పెరిగిపోతుంటే, అర్చకుడు ఒకరు దానిపై మేకు కొట్టడంతో ఆ శివలిం గం నుంచి రక్తం ధారలై ప్రవహించిందట. దాని కారణంగానే శివలింగంపై ఎర్రటి చారిక ఏర్పడిందన్నదంటారు. ఇక్కడి అమ్మ వారికి బాలచాముండిక అని పేరు.

ప్రాచీన చిత్ర, శిల్ప కళకు అద్దం పట్టే దేశంలోని మూడు ప్రధానమైన బౌద్ధ క్షేత్రాల్లో అమరావతి ఒకటి. అమరావతి శిల్పకళా వైశిష్ట్యాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే. అమరావతి కథల పేరిట సుప్రసిద్ధ కథా రచయిత సత్యం శంకర మంచి పుస్తకాన్ని వెలువరించారు. హిందువులు, బౌద్ధుల పుణ్యక్షేత్రమైన అమరావతి జిల్లా కేంద్రమైన గుంటూరు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. తూర్పు చాళుక్యులు, తెలుగు చోళులు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారు. ఇంతటి వైశిష్ట్యమైన చరిత్ర, చారిత్రిక ప్రభావం గల ఈ మట్టిలో ఎన్నో నిర్మాణాలూ, ఎన్నో విజయాలూ, ఎంతో పవిత్రత కనిపిస్తూంది. మహామహులు నడచిన నేల. ఎంతగా బౌద్ధ ప్రచారం జరిగి, బౌద్ధమతం చిగురించి, బౌద్ధక్షేత్రంగా వర్ధిల్లినప్పటికినీ, ఇక్కడ హిందూ మతంగానీ హైందవారాధన కానీ సడలిపోలేదు. హడలి పరుగులెత్త లేదంటే అమరేశ్వరుని మహిమే! త్రిలిఙ్గ దేశంగా పేరు పొందిన అఖండ తెలుగుదేశం భవిష్యత్తులో ఎలాంటి ముక్కలూ ప్రక్కలూ గాకుండా ఉండాలంటే అమరేశ్వరానుగ్రహం కలగాలి. కృష్ణవేణమ్మ వేణీతరంగాల్లో పంట భూములు తడిసి, వరిసిరిని పెంచాలి. ప్రజల దాహార్తికి మంచి నీరొసగాలంటే అమరేశ్వరుని పాదాల చెంత ప్రవహిస్తున్న కృష్ణానదే శ్రీరామరక్ష – పాలకులదే బాధ్యత. ●





విజయనగరం బుల్లోడి
గొల్లపూడి మారుతీరావు!
విజయబావ్వుటా!

వడిగాలుపు పోతూ జడివాన వచ్చి జగతికి చల్లదనం సంకల్పిస్తూ, మరో ఆరు నెలలూ ఏ ధోకా లేకుండా చేస్తుందట. వారాలు చేసి చదువు కున్న అబ్బాయి – ఏ వారమూ కాల్‌షీట్సు దొరక నంత స్థాయికి సినిమా రంగంలో పెద్ద నటుడై పోయాడు.

చదువుకొనే రోజుల్లోనే రేడియో నాటక పోటీల్లో బహుమతి నందుకొని, ఆ బహుమతి పైకంతో రేడియో కొనుక్కొని రేడియో రంగం లోనే ఉన్నతాధికారిగా, తనపైనున్న ఉన్నతాధి కారుల మన్ననలందులకున్నవాడు. తండ్రి ప్రేమను పొం దిన మారుతిలా తండ్రి చూపిన ప్రేమానురాగాల్లో తరించినవాడూ – అదే పుత్ర ప్రేమతో తన కుమారుడు శ్రీనివాస్ మరణించ లేదనుకుంటూ సంవత్సరం సంవత్సరమూ శక్తికి మించినట్లు అన్న ట్లుగా – కుమారుని పేరిట స్మారక ప్రదానోత్స వాన్ని నభూతో న భవిష్యతి అన్నవిధంగా జరి పిస్తున్నవాడు మారుతీరావు – రెక్కలు లేకుండా మారుతి నూరు యోజనాలు ఆకాశ యానం చేసినట్లు – ఆయన రచనలన్నీ ఆకాశ యానం ద్వారానే ఎన్నో యోజనాలు పయనించాయి – మారుతి వ్యాకరణ పండితుడైనట్లు – సినీ రంగంలో వాక్స్ఫురితుడై – ఓ కొత్త ఒరవడిని సృష్టించుకున్నవాడూ, 'నథింగు-టుడు' అనే నటునిగా గాకుండా – 'సమ్'-వెరైటీ-థింగు-టుడూ' అంటూ చలనచిత్ర రంగంలో స్థానం పరచుకున్నవాడైన గొల్లపూడింటి పేరు వాడు మారుతీరావు అంటే ఎరుగనివాడు రచనా రంగంలోనూ లేడు; నటనా రంగంలోనూ లేడు.

తన స్థాయికి మించినట్లు చలనచిత్ర దర్శకునిగా ఆరంగేట్రమ్ చేసిన దర్శకుణ్ణి కంచు కాగడాతో వెదకి పట్టి రెండు లక్షల రూపాయలు రొక్కి బహుమానం, రెండు లక్షల రూపాయలు బహుమతీ ప్రదానోత్సవానికి వెచ్చిస్తున్న మొనగాడు సినీ రంగంలో లేనేలేడు.

సంపాదించిన డబ్బుతో సినిమా తీద్దామా, స్టూడియో కడదామా – అనే ధోరణి నిసుమంతైనా లేనివాడు గొల్లపూడి మారుతీరావు. లక్షల బహుమతీ ప్రదానంగా యిస్తున్నాడు. లక్షల్ను బహుమతీ గ్రహీతగా గ్రహిస్తున్నవాడూ మారుతీ రావే!

ఆయన నటనలో ఎం.ఆర్.రాధా, టి.ఎస్. బాలయ్య వంటి సైలంట్ విలన్‌షిప్ ఉన్నది, సైరన్ మోత లాటి స్వరమూ వున్నది. ఈ రెండింటినీ గ్రహించిన నేను 'కాలరుద్రుడు' చిత్రంలో సరితూగే పాత్రను ధరింపచేసాను. దురదృష్టవశాత్తూ ఆ చిత్రం 'జనసందర్శనం' చేయలేదు, జనంలో నన్ను నిర్మాతగా నిలుపలేదు.

మారుతీరావు నటనలో ఒక 'ఈజ్' ఉన్నది, మాటల్లో 'మెలోడీ' ఉన్నది. ఆయన సాటివాడు వాడు ఆయనేమో.

రేడియో నాటకం సినిమా మూడిటిలోనూడు మారుతీరావు ఒక్కడే. శ్రోత్రియ బ్రాహ్మణుడు, ఆధ్యాత్మిక చింతనా పరుడు – ఆయన సతీమణి కూడా శివానీ అంతకు తగిన బొంత.

రానాను యిప్పడివారు పెద్దవాళ్ళైన తల్లిదం డ్రులు పంచిన ప్రేమను మరిచిపోతున్నారు. ఆనం దం అనంతమైనదనీ – దాన్ని జీవితాంతం వరకూ స్టోరోజి (నిలువ) చేసుకోవాలని భావించే గొల్లపూడి మారుతీరావును మనసారా అభి నందిస్తున్నాను. ●

పి.ఓబులరెడ్డికి త్యాగరాజ కృతులంటే ప్రాణం!

గతంలో తెలుగు అకాడమీ జరిపే కార్యక్రమాల పోషకకర్త!



త్యాగరాజ కృతులపై గల అపారమైన ప్రేమ, అంకితభావంతో – ఆ కృతులకు ఆంగ్ల లిపి వ్రాయించి, వ్యాఖ్యానంతో అనేక సంపుటములుగా వెలువరింపచేసిన వదాన్యుడు పి.ఓబులరెడ్డి. ఆయన పేరిట వాణీమహల్లో – ఒక ఏ.సి.హాలు నిర్మాణమే జరిగింది.

మద్రాసు తెలుగు అకాడమీ (టి.వి.కె.శాస్త్రి ప్రధానకర్తగా) జరిపిన సాంస్కృతిక కార్యక్రమాలకు పి.ఓబుల్‌రెడ్డి ప్రధాన పోషకకర్త. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు ఆంగ్లంలో రావడానికి ఓబులరెడ్డి ప్రధాన కారకుడు.

జపాను వారి సహకారంతో ఆయన NIPPO బేటరీస్ సంస్థలను నెలకొల్పి – దేశావ్యాప్తంగా EVEREADY బేటరీస్ పోటీకి నిలిచి, విజయాన్ని సాధించినవాడు. తదలో ఆయన స్థాపించిన NIPPO బేటరీ సంస్థ ఎందరికో విద్యుత్పరికాలను ఉత్పత్తి చేస్తుంది.

ఆయన మరణించిన తరువాత, ఆయన కుమారుడు విజయకుమారరెడ్డి, ఆయన కోడలు ప్రీతిరెడ్డి (అపోలో హాస్పిటల్ ప్రతాపరెడ్డి గారి అనుంగు కుమార్తె) లిరువురూ – ఓబుల్‌రెడ్డి పథగాములై, కర్ణాటక సంగీత పోషకులుగా పి.ఓబుల్‌రెడ్డి, జ్ఞానాంబ ట్రస్టు పేరిట సంగీత కార్యక్రమాలను, సంగీత విద్వాంసులను బహుముఖంగా ప్రోత్సహిస్తున్నారు.

సంగీత సభలను ప్రోత్సహిస్తూ, సంగీత కార్యక్రమాలకు వెన్నుదన్నుగా ఉండడం, నగదు బహుమతులూ, బంగారు పతకాలను ప్రదానం చేయడం వంటి కార్యక్రమాలందు కూడా పాలుపంచుకోవడం, వాయిద్య కళాకారులకూ, నర్తకులకూ అవార్డులివ్వడం కొనసాగిస్తున్నారు. ఓబుల్‌రెడ్డి ఆశయాలకనుగుణంగా ట్రస్టు ద్వారా సేవలు చేస్తున్నారు; మరో ప్రక్క NIPPO సంస్థ పారిశ్రామికోత్పత్తినీ, వ్యాపారాన్నీ విస్తృతపరుస్తున్నారు. ప్రతీ బహుళపంచమికీ వాణిమహల్‌లోని ఓబుల్‌రెడ్డి హాలులో సంగీత కచ్చేరీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

స్వతాహా ఓబుల్‌రెడ్డి సాహిత్యాభిమాని. గ్రంథ ప్రచురణలకు ఇతోధికంగా చేయూతనిచ్చేవాడు. తమిళదేశంలో ఉంటూ వ్యాపారం చేస్తున్నప్పటికినీ, తెలుగు మూలాలెరింగినవాడు, తెలుగు బాగా మాట్లాడేవాడు – పత్రికా రచయితల పట్ల అభిమానం కనబరిచే – సాహితీ సంపన్నుడు. ఓబులరెడ్డి జ్ఞానాంబ ట్రస్టు సాహితీ కార్యక్రమాల పట్ల ఆసక్తిని కనబరచడం ప్రశంసించదగినది

అమృతాంజనం, కేసరీ వంటి సంస్థల్కు తెలుగువారు స్థాపకులైనా – వారు తెలుగును మరిచిపోయారు. రెడ్లు, సాహితీ కళాపోషకులు, సంస్కృతాభిమానులైన వీరు తెలుగు పట్ల శ్రద్ధ వహిస్తూంటే చెన్నయ్‌లో తెలుగువాళ్ళ బలిమి కలిమిగా చెలిమి చేస్తుందని, భాష పరిఢవిల్లుతుందని భావిస్తాను. ●

నారు పోసిన వాడు నీరు పోయడా!

– రాణి పార్థిభన్

నమ్మకం

జీవితాన్ని నడిపించేది, బ్రతుకు బాటలో బాసటగా ఉండేది
మొలకెత్తిన నాడే, గర్భస్థ శిశువు అందాల పాపడై
ఒడినింపుతాడని, నెలత నమ్మకమే, జీవితానికి నాంది
చిగురై, మొగ్గ, పరిమళించే పూవులా పెరిగి
ప్రయోజకుడై నిలుస్తాడని తండ్రి నమ్మకం!
గగనాన మేఘం గంను జల్లితే
భూమి నుంచి దూసుకొచ్చి, మొలకై, మొగ్గయి, వరియై
సస్యశ్యామలమై, అందరి ఆకలి తీర్చివచ్చని విత్తనం నమ్మకం!
ప్రదోష ప్రభాకరుడిని చూసినా
ప్రత్యూషం వస్తాదన్న నిబ్బరువును ఇచ్చేది, నమ్మకం!
నమ్మకం ఆమని కోయిలల
జీవిత నావకు తెఱచాప
గుండెను దిటవు చేసి, ఆలోచనలకు అమృతం పోసి
ఆటుపోట్లకు నిలదొక్కుగలిగేలా చేసి
బ్రతుకును నడిపేది నమ్మకం!
గడ్డు సమస్యలు, అలలై ఎగిసి,
వేటాడి, వెంటాడి వేధిస్తే
విసిగి అడుగంటేది ఆశ మిగిలేది నిరాశ
దేనిని నమ్మాలన్నది ప్రశ్న
అప్పుడే కావాలి నమ్మకం
కాని ఒడిదిడుకులు తట్టుకుని
నమ్మకం కొసనైనా పట్టుకుని నడవాలి ముందుకు
విద్య అయినా, వాంఛలైనా, వైరాగ్యమైనా
సాధించేందుకు కావాలి సంకల్పం
అందుకు చేయూత నిచ్చేది నమ్మకం!
ద్రోహం చేసేది కాదు నమ్మకం!
బాధ కలిగితే అమ్మా అని పిలిచేది
బరువు మోస్తాదన్న ఆ తల్లిమీద నమ్మకంతో కదా!
చీకటి ఉండేది మన మనస్సులో, మన ఆలోచనలలో
మనిషి మీద మనసు మీద నమ్మకంతో
ప్రయాణం పొడిగించాలి
భగవంతుడు నడిపేది ఈ విశ్వం
దానిమీద కావాలి అంచంచల విశ్వాసం
అదే ఆ పరమాత్ముని మీద నమ్మకం!
రక్షించమని వేడుకునేది
ఆదుకుని, అద్దరికి చేరుస్తాడన్న నమ్మకమే.
ఈ జీవితం, ఆ పరమాత్ముని ప్రసాదం
కాదిది వ్యర్థం, దీనికి ఉందొక అర్థం
ఆ పరమార్థం అర్థం చేసికుని
ముందుకు వెళ్లేందుకు ఆలంబనే నమ్మకం!
భారం భగవంతుని మీద వేసి, మనల్ని మనం నమ్ముకుని
ముందుకు నడిస్తే, నమ్మకమే శ్రీరామరక్షయై వెలుగుచూపుతుంది
నారు పోసినవాడు, ఆ నారాయణుడు
నీరు పోస్తాడన్న నమ్మకమే మనకు ప్రణవనాదం.

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

తెలంగాణా రాజకీయ నాయకుడు ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి నిర్మించిన చిత్రం - సావిత్రి మణిపూసలా నటించిన- 'చివరకు మిగిలేది?' చిత్రం తీసినవాళ్ళకేదీ మిగల్లేదు



రాజకీయవేత్త, మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి ప్రత్యేక తెలంగాణా ఆవశ్యకతను బలంగా నొక్కి చెప్పిన వారుగా మనందరికీ తెలుసు. అయితే, తెలుగు సినిమా ప్రపంచంలో ఆయన ఒక ఆణిముత్యం వంటి సినిమాను నిర్మించినట్లు మాత్రం కొద్దిమందికే తెలుసు! తెలంగాణా సినిమా పరంపరలో ఆయన నిర్మించిన ఆ చిత్ర విశేషాలు చదువుకుందాం.

తెలుగు సినిమా రంగంలో 1950 దశకంలో విజయా, వాహిని, పి.ఏ.పి., ఎన్.ఏ.టి. అన్నపూర్ణ వంటి సంస్థలు శరపరంపరగా సాంఘిక, పౌరాణిక, జానపదాలను నిర్మిస్తున్న కాలం అది. వీటిలో అన్నీ ఒకే మూసలో పోటీపడి తయారయ్యేవి. దాంతో ప్రేక్షకులంతా ఆ ధోరణి సినిమాలను ఆదరించక తప్పని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేక్షకుల మత్తును వొక్కసారిగా వదిలించే దృశ్యకావ్యం ఒకటి వచ్చి తెలుగు సినిమా రంగాన్ని ఒక కుదుపు కుదిపింది. అది తెలంగాణా నిర్మాతలు తీసిన సంచలన చిత్రం చివరకు మిగిలేది (1960). నల్లగొండ జిల్లా మోత్కురు మండలం అడ్డగూడూరు గ్రామానికి చెందిన దివంగత ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి సినీ చరిత్రలో నిలిచిపోయే ఒక మంచి పనిచేశారు. మరి, 'చివరకు మిగిలేది' చిత్ర నిర్మాణానికి ప్రధాన కారకులు ఆయనే. వారు బాగా చదువుకున్నారు. మంచి సాహిత్యాభిలాషి. ఆనాటి సినిమా తీరు తెన్నులను చూసి ప్రేక్షకుల అభిరుచిని సంస్కరించే సినిమా ఒకటి తీయాలనుకున్నారు. తన మిత్రులు, రాజ్యసభ ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి వర్యులు ఎం.సత్యనారాయణరావులతో కలిసి లాభనష్టాలతో నిమిత్తం లేకుండా వొక సినిమా తీయాలనే నిర్ణయానికి వచ్చారు. నిజానికి వారు ముగ్గురు మంచి మిత్రులు. యూత్ కాంగ్రెస్ రాజకీయాలనుండి కలిసి పనిచేసిన వారు. వారొక మంచి చిత్రం నిర్మించాలనుకున్నారు. దాంతో వెంటనే ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. అయితే, నిర్ణయాధికారం మాత్రం పురుషోత్తమరెడ్డికే అప్పగించారు. ఎందుకంటే, ఆయన మంచి అభిరుచి, నిర్వహణా సామర్థ్యం ఉన్నవాడు. కాగా, పురుషోత్తమరెడ్డికి సినిమా తీసే ప్రేరణ కల్పించినవాడు ఎం.కొండారెడ్డి అనే మిత్రుడు. సూర్యాపేటలో కలిసి చదువుకున్న మిత్రులు వారు. కొండల్‌రెడ్డి హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో డిప్లొమా చేసి ఉన్నాడప్పటికే. ఎప్పుడైతే తాను సినిమా తీయాలనుకున్నాడో దానికి కొండల్‌రెడ్డి తోడ్పాటు తీసుకోవాలని అనుకున్నాడు పురుషోత్తమరెడ్డి. ఇట్లా యు. పురుషోత్తమరెడ్డి ప్రధాన నిర్మాతగా, సహనిర్మాతలుగా పొల్వాయి, ఎం. ఎస్. కొండల్‌రెడ్డి, కె. సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, మధుసూధనరావులతో 'మంజీరా ఫిలింస్' బ్యానర్ ఏర్పాటైంది.

అప్పుడే హైదరాబాద్‌లో సారధి స్టూడియో ఏర్పాటై తొలిసారిగా 'మా యింటి మహాలక్ష్మి'(1959) సినిమా తయారై విజయవంతంగా నడుస్తోంది. ఈ చిత్ర దర్శకుడు గుత్తా రామినీడు దగ్గరకెళ్లి "ఈ వ్యాపారంలో ఎంత లాభం? ఎంత నష్టం? అన్నది కాదు మా ఆలోచన. ఒక మహత్తరమైన చిత్రాన్ని ఈ యువ బృందం తీసిందనే పేరు మనందరికీ రావాలి. మాకు అలాంటి సినిమా అందించాలని ఉంది" అన్నారు.

అప్పట్లో విభిన్న తరహా కథలు ఎక్కువ రూపొందేవి కావు. మన సినీ రచయితలంతా మూసధోరణిలోనే ఆలోచించేవారు. అందువల్ల కొల్‌కతా వెళ్లి అక్కడ కొన్ని రోజులుండి, సినిమాలు చూసి మంచి కథలు ఉండవచ్చని దర్శక నిర్మాతలంతా కలిసి అక్కడికి వెళ్లారు. అక్కడ 'సినీ అడ్వాన్స్' పత్రికలో రివ్యూలు రాసే సరోస్‌సేన్ గుప్తాను కలుసుకుని నగరంలో నడుస్తున్న సినిమాల గురించి అడిగారు. వీరి అభిరుచి తెలుసుకుని ఉత్తమ్‌కుమార్ సుచిత్రాసేన్ నటించిన సినిమా 'దీప్ జలా జాయ్' ని ముందుగా చూడమని సలహా ఇచ్చాడాయన. దానితో బాటే 'శాప్‌మోచన్' సినిమా కూడా ఆడుతున్నది. 'దీప్ జలా జాయ్' సినిమా అందరికీ నచ్చింది. కానీ తెలుగులో ఆర్థికంగా విజయవంతం అవుతుందని చెప్పలేనని దర్శకుడు చెప్పేశాడు. మరో చిత్రం 'శాప్‌మోచన్' బాగున్నా అది అప్పటికే తమిళ్‌లో రైట్స్ లేకుండానే రీమేక్ చేశారని తెలిసింది. దాంతో 'చివరకు మిగిలేది' సినిమా తెలుగు, తమిళ, కన్నడ రైట్స్ తీసుకొని ఒక ప్రింట్‌తో సహా మద్రాసు వచ్చారు.

వచ్చీ రాగానే మొదట ఈ సినిమాను నాగేశ్వరరావుకి చూపించారు. ఆయన చూశాక 'సినిమా బాగా వుంది, కాని కమర్షియల్‌గా ఆడదు. మీరే ఆలోచించుకోవాలి' అన్నారు. అయినా లీడ్‌రోల్‌లో మాత్రం సావిత్రి తప్ప మరొకరు నప్పరని ఆయన చెప్పారు. ఇది హీరోయిన్ ఓరియెంటెడ్ కనుక తాను నటించలేనని కూడా ఆయన అన్నారు. దాంతో సినిమాను మద్రాసులో సావిత్రి, ఎల్.వి. ప్రసాద్, మల్లాది రామకృష్ణశాస్త్రిలకు చూపించారు. ఆ షోకి రమణారెడ్డి కూడా వచ్చాడు. ప్రసాద్ సినిమా చూశాక **(తరువాయి 23వ పేజీలో)**

అంకితభావానికి మారుపేరు సావిత్రి

'సినిమా నిర్మాణ సమయంలో సావిత్రి వ్యక్తిత్వం ఎంతో దగ్గరగా చూడగలిగాం. ఆమె చాలామంచి మనిషి. మర్యాదస్తురాలు. షూటింగ్ జరిగినంత కాలం పద్మపాత్రలో లీనమై ఉండేది. చివరి సీన్‌లో ఆమె నటన అద్భుతం. నటనలో పరాకాష్టకు చేరి ఆమె ట్రాన్స్‌లోకి వెళ్లినంత పనిచేసింది. ఈ సీన్‌ని ఆమె అడిగి మరీ రాత్రి పూటనే షూటింగ్ పెట్టమంది. సీన్ పూర్తయ్యాక చాలాసేపటి వరకు తననెవరూ మాట్లాడించొద్దని చెప్పింది. ఆమె అంకితభావాన్ని దగ్గరగా చూడటం మా అదృష్టం. ఒక్క మాటలో ఈ చిత్రంలో ఆవిడ నటన శిఖరాయమానమైంది.

- కె.సుధాకర్‌రెడ్డి ('చివరకు మిగిలేది' సహాయ దర్శకుడు)

ఎన్నగతరమా? ఏడుకొండలవాని మహిమ!- మూగయువకునికి మాటలు ప్రసాదించావు తండ్రీ!



గోవిందా- అంటే చెల్లును పాపాలన్నీ- అన్నాడో సినిమా కవి. చెల్లని రూపాయిగా వెళ్ళి దర్శనం చేసుకుంటే పాపాలు చెల్లపుగానీ, చిత్తశుద్ధితో అంకితభావంతో ఆయన్ను దర్శనం చేసుకున్నప్పుడాయన తప్పక అనుగ్రహిస్తాడు, అభీష్టసిద్ధి కూరుస్తాడు. ఇది ప్రత్యక్ష నిదర్శనమయింది.

ఇటీవల ఓ తల్లితండ్రులు కుమారుని మొక్కు చెల్లించుకోవడానికి తిరుమల వచ్చి, శ్రీనివాసుని దర్శనం చేసుకున్నారు. వాళ్ళబ్బాయికి మాటలు రావు. ఆలయంలో మూల విరాట్మూర్తుణ్ణి దర్శిస్తూ, వాళ్ళు ముందుకు వెడ్తూన్నప్పుడు- ఆ పిల్లవాడు 'గోవిందా గోవిందా' యని ఆర్తితో పిలవడం, వాళ్ళ తల్లితండ్రులు ఆశ్చర్యపోయారు. మా అబ్బాయికి మాటలు రప్పించావా! తండ్రీ! అంటూ వారు కూడ గోవిందా, గోవిందాయని ముకుళిత హస్తాలతో మురిసిపోయారు! ఎన్నగతరమా- శ్రీ వేంకటేశమహిమా! మనస్ఫూర్తిగా అంకితభావంతో గోవిందా యని అంటే చెల్లునే పాపాలన్నీ అన్న కవి మాటల్లోని పొందికగల అక్షరాలు సత్యమని ఋజువు పరిచింది.

40 గంటలు, 50 గంటలు ఎదురుచూస్తూ, నీ దర్శనం చేసుకుంటున్న వారిని అనుగ్రహిస్తున్నావు శ్రీ వేంకటేశా! పాహిమాం కృపయా దేవా! పాహి పాహి-

(12వ పేజీ తరువాయి) 'ఇది మీకు పేరొచ్చే చిత్రమే గాని, డబ్బులు రావడం కష్టమన్నారు. హిందీలో 'నేను శారద (ఇలవేలుపు) తీసినట్లుగా అవుతుంది' అన్నారాయన.

ఇక బెంగాలీ స్క్రిప్టును హైదరాబాద్‌లో పనిచేసే ఒక బెంగాలీ ఆఫీసరు భార్యతో ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేయించారు. ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదం చేసింది సహ నిర్మాత, సహ దర్శకుడు అయిన కె. సుధాకర్‌రెడ్డి. స్వతహాగా వీరు కథా రచయిత. అయితే, స్క్రీన్‌ప్లే రాయడానికి ముందుగా త్రిపురనేని గోపీచంద్‌ని అనుకున్నారు. గోపీచంద్‌కి వీలుగాక అట్లూరి పిచ్చేశ్వరరావును సూచించారు. కొండల్ రెడ్డి పూర్తిగా ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. వీరితో బాటు లక్ష్మీనారాయణ అనే హైదరాబాదీ మరో సహాయదర్శకుడులగా ఉన్నాడు. ఈయనే ఆ తరువాత లక్ష్మీదీపక్ పేరుతో చాలా హిట్ చిత్రాలు తీశారు. ఇక హీరోయిన్‌గా ముందుగా జమునను అనుకున్నారు. కానీ, నాగేశ్వరరావు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను సావిత్రినే తీసుకోవాలనడంతో అట్లానే చేశారు. అయితే, ఆయన కూడా మొదట సూత్రప్రాయంగా అంగీకరించినా తరువాత చేయలేనన్నారు. ఆ పాత్రను కాంతారావు పోషించారు. అలాగే, సినిమాలో హీరోయిన్ పాత్ర అయిన నర్స్ (పద్మ) పాత్రను సావిత్రి ఎంతో ఇష్టపడి ఒప్పుకున్నది. ఆ రోజుల్లో ఆమె పారితోషకంగా 40 వేలు తీసుకునేది. అంతే ఇచ్చారు కూడా. అయితే ఈ సినిమాను తాను తమిళంలో తీస్తానని 30 వేలిచ్చి తమిళ హక్కులు తీసుకున్నది. తెలుగులో ఈ చిత్రం ఫెయిలవడంతో ఆమె తమిళంలో తీయలేదు.

చిత్రంలో హీరోయిన్‌గా సావిత్రి నటించిందా పాత్రలో జీవించిందా చెప్పలేము. ఇతర పాత్రల్లో కాంతారావు, బాలయ్య, హరనాథ్, ప్రభాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, రమణారెడ్డి తదితరులు నటించారు. అశ్వత్థామ సంగీతం. ఘంటసాల, సుశీల, పి.బి.శ్రీనివాస్ గాయనీ గాయకులు. 'సుధవోల్ సుహాసినీ, 'అందానికి అందం నేనే', 'నెలరాజు జతమాని చెంగల్వమనియేన' పాటలు పాపులరైనవి.

ఉత్తమాభిరుచిగల ప్రేక్షకులకు 'చివరకుమిగిలేది' ఒక భిన్నమైన చిత్రంగా మెప్పుపొందింది. విజయవాడలో ప్రసిద్ధ రచయిత్రి తెన్నేటి హేమలత సినిమా చూసి 'ఈ సినిమా గొప్పగా ఉంది. సామాన్య ప్రేక్షకులకు అంతగా నచ్చకపోవచ్చు. సాధ్యమైనంత త్వరగా వెళ్లిచూడండి. లేకుంటే ఒక గొప్ప సినిమాను మిస్ అయినట్లేనని' మిత్రులకు, పత్రికల వాళ్లకు ఫోన్ చేసి చెప్పారు.

'చివరకు మిగిలేది' 1960 నవంబర్ 25న విడుదలైంది. కానీ, ఆర్థికంగా విజయం సాధించలేదు. సినిమా గొప్పగా తీసినప్పటికీ మంచి డిస్ట్రిబ్యూటర్ లేకపోవడం కూడా అపజయానికి కారణం. 'ఒకవేళ ఈ సినిమా సక్సెస్ అయితే ఈ తెలంగాణా వారు ఇక్కడే స్థిరపడి పోటీకొస్తారేమో?' అని అప్పటికే స్థిరపడిన సీమాంధ్ర సినిమాకు డిస్ట్రిబ్యూటర్స్‌గా మంచివారిని రాకుండా అడ్డుకున్నారని సుధాకర్‌రెడ్డి చెబుతారు. అయితే, పత్రికలు చివరకు మిగిలేది గురించి గొప్పగా రివ్యూలు రాసాయి. మద్రాసు ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్ వారు ఈ చిత్రాన్ని, ఉత్తమ చిత్రంగా ఎన్నుకొని పురుషోత్తమరెడ్డికి ఉత్తమ నిర్మాత, సావిత్రికి ఉత్తమనటి, రామినీడుకి ఉత్తమ దర్శకుడు అవార్డులిచ్చారు. నార్ల వెంకటేశ్వరరావు కూతురు పెళ్లిలో 'చివరకు మిగిలేది' ప్రదర్శించి డాక్టర్లు ఎక్కువగా హాజరైన రిసెప్షన్‌లో "వైద్యవృత్తి ఎంత ఉదాత్తమైందో, కళాత్మకంగా చూపిన ఈ చిత్రాన్ని డాక్టర్లందరూ చూడాలని" మరీ మరీ చెప్పారాయన. ముఖ్యంగా సావిత్రి నటన ఆ రోజుల్లో చర్చనీయాంశమైంది. మూలచిత్రం 'దీప్ జాలా జాయ్' లో సుచిత్రా సేన్ కన్నా వందరెట్లు గొప్పగా నటించింది. ఇదే చిత్రాన్ని 'ఖామోషీ'గా హిందీలో తీస్తే వహీదా రహేమాన్ సావిత్రి దరిదాపులకు రాలేకపోయింది.

చివరగా చెప్పాల్సిన విషయం నిర్మాతలకు 'చివరకు మిగిలేది' ఏమీ మిగల్చలేదు. అద్భుతంగా నటించిన సావిత్రికి జీవితంలో ఏమీ మిగలలేదు. కానీ, గొప్ప కళాత్మక చిత్రంగా, తెలంగాణ చిత్ర నిర్మాతల ఉత్తమాభిరుచికి దర్పణంగా సినీ చరిత్రలో ఒక ప్రత్యేస్థానాన్ని పొందింది. **- హెచ్.రమేష్‌బాబు కృతజ్ఞతతో**

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
Ring Road, Tirumala. Ph : 517504
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

పల్నాటి సోదరకవులు
కన్నెకంటి ప్రభులింగాచారి - వీర భద్రాచార్యులు కొందరికెరుక!

కన్నెకంటివారి వంశంలో వీరభద్రాచార్యులు కారణంగా- వీరి వివరములు కొంతగానే విశదమవుతున్నాయి.

శేముషీఘనుడు, కాశీకృష్ణ గీర్వాణ
వాణి నగ్గించెను భారతోర్వి
కవి చక్రవర్తి జాషువ ఖండ కావ్యము
లాదరించెను విశాలాంధ్ర భూమి
తుమ్మల సత్యవీంద్రుని రాష్ట్రగానమ్ము
తెలుగు తల్లికి బంధముల వెలార్చె
శతవధాన విధాన సమరాంగణమున కి
రీటి కల్పులు పలనాటి కవులు
రాజ రాజులు శ్రీ వాసిరెడ్డి వారి
దాన ధారలలో నాంధ్రి తానమాడె
రైతు నాయకూదాచార్య రంగనాయ
కులు జనించెను, గుంటూరు కొరత గలదె.

అని గుంటూరు సీమను గూర్చి గుంటూరు పత్రిక (1953 సం॥) లో సాహితీ ప్రపంచంలో విశిష్టలగు పల్నాటి సోదర కవుల స్థానాన్ని కళాప్రపూర్ణ కొండవీటి వెంకటకవిగారు వ్రాశారు. పల్నాటి సోదరకవులు వ్రాసిన గ్రంథాలు వారి గొప్పతనం ఈతరం సాహితీ ప్రియులకు తెలియపరచవలసిన అవసరం యెంతగానో ఉన్నది.

సాహిత్య రంగమున జంటకవులైన వారున్నారు. ఒకే తల్లి కడుపున పుట్టిన జంట కవులున్నారు. కొందరు జంటలుగా యేర్పడి కవిత్వం చెప్పినవారున్నారు. ఒకే తల్లి కడుపున జన్మించిన కుమారులందరు కవులై, సోదరకవులుగా సుప్రసిద్ధులైన వారెందరున్నారు? తమకూ తమ ప్రాంతానికి వన్నె చేకూర్చిన వారెందరున్నారు అనే విషయం మృగ్యమే?

పలనాటి ప్రాంతంలో గంగా యమునలని ప్రస్తుతింపదగిన నాగులేరు, చంద్ర పంకలలో ఒకటైన, దాచేపల్లికి, నాగులేరు సమీపంలో తక్కెళ్ళపాడులోని విశ్వబ్రాహ్మణ కుటుంబంలో వీరు జన్మించారు. వీరి తల్లిదండ్రులు కన్నెకంటి కోటమాంబా రాజలింగాచార్యులు. ప్రభులింగాచార్యులు (1900-46) చినలింగాచార్యులు (1903-68) వీరభద్రాచార్యులు (1912-74), సంగీత రసపిపాసి సుందరమ్మ, కవయిత్రి కమలాక్షమ్మలను కన్న ఆ తల్లిదండ్రులు ధన్యజీవులు, శతాధిక గ్రంథకర్తలు పల్నాటి సోదల కవులు. వారి మేనమామలు కూడా 18 తరాలుగా కవిత్వం వ్రాసారు. సాహితీ చరిత్రను త్రవ్వితీస్తే అడిదము సూరకవి వంశీయుల్ను కూడా ఈ పల్నాటి వంశీయులనధిగమించారు. పల్నాటి సోదర కవుల తాతముత్తాతలలో ఒకరైన భద్రప్ప (తరతరాలుగా కవిత్వం వ్రాయటంలో) నల్లగొండ జిల్లా కన్నెకల్లు నుండి పల్నాటికి వచ్చారు. పల్నాడులో పల్నాటి కవులుగా స్థిరపడటానికి ఆయన మూలకారకుడు.

కన్నతల్లి సుసాధ్వి కవయిత్రి గుణబింబ
గురుకళా నికురుంబ కోటమాంబ
తండ్రి సంగీత విద్యావేది హరభక్తు
డార్యుండు రాజలింగాభికుండు,
అగ్రజుల్ శతావధానాష్టావధాన పా
రంగతుల్ ప్రభులింగ, లింగ కవులు,
ఇలవేల్పు భక్తపత్సలుడు వేములవాడ
రాజేశ్వరుం డర్థరాజధరుడు
మేనమామలు సాత్విక జ్ఞాన నిధులు!
వరకవీంద్రులు కొండాస్వాయ కవులు
గోత్రపతి లోకహిత తపఃకోవిదుండు
ధర్మశాస్త్రార్థని భరద్వాజమౌని
ప్రాచీనాంధ్ర కవిత్వ తత్త్వ విధులం బాటించి నాకున్న వి
ద్యా చాతుర్యము, జూపి యీ చరిత వ్రాయం బూనితన్, వీరభ
ద్రాచార్యుండను కన్నెకంటి కులుండన్ ధాత్రీజన స్తుత్యమై
యా చంద్రార్కము వెల్గుగాత మిది యుద్యత్ కీర్తి సాంద్రమ్ముగన్

అని వీరభద్రాచార్యులు వ్రాసిన పద్యాల నుండి ఈ వంశీకుల, సోదరుల ఔనత్యాన్ని గ్రహించవచ్చును.

శతాధిక గ్రంథకర్తలు, శతాధిక అవధానులూ యైన వీరు ముగ్గురూ విడివిడిగా కూడా తమ ఖ్యాతులను రచించారు. ఆ కృతుల మీద వారి పేర్లతోపాటు, పల్నాటి సోదరకవులు అనే ముద్రను వ్యాప్తం కావించారు.

ప్రభులింగాచార్యులుగారు శ్రీ సత్యనారాయణ చరిత్రము (1924) పలనాటి వీరచరిత్రము (1928) నీలకంఠేశ్వరశతకము (1930) పురూరవ నాటకము (1933) పోతన పద్యకావ్యం (1942) భరతపుత్రుడు (1946) ఆంధ్రసోదరా (1946) ఉమాకాన్తంగారి జీవిత చరిత్ర (1936).

చిన లింగాచార్యులుగారు- వేంకటరంగ శతకము (1947) సూర్యనారాయణ స్తవము (1952) కయిమొరలక్ష్మీప్రశంస (1962) సూవ్రత (1963) వేంకటరమణ శతకము (1964) దీర్ఘిక మహాపతివ్రత కథ (1964) జ్యోతిస్సులు (1965) రాజరాజు (1965) స్తోత్రమంజరి(1965) వేంకటరమణ స్తుతి (1967) క్రీస్తు సుప్రభాతం (1967) బంగారుధార(1965) ఆర్తనినాదము (1964-68)

వీరభద్రాచార్యులు గారు ఆంజనేయశతకము (1936) శ్రీ కుమార విజయము (1936) శ్రీ వీరబ్రహ్మేంద్రస్తుతి (1940) అచ్చమాంబికా ప్రశంస (1940) పేదరాలు (1945) భువనజ్యోతి (1948) ఆపన్న (1948) సువర్ణాంజలి (1949) విశ్వ విపంచి (1950) చిరుమామిళ్ళ సుబ్బదాసు జీవితచరిత్ర (1950) లోకబాంధవులు (1953) పొట్టి శ్రీరాములు (1953) పార్వతి (1954) శ్రీ కోదండరామ శతకము (1956) నవభారతము (1948-51) అటుకులమూట (1958) తెలుగుపాప (1961) పేదకాపు (1963) కృష్ణవర్ధన చరిత్ర (1962) శ్రీశైలఖండము (1974) మొదలైన గ్రంథాలను రచించారు.

పల్నాటి సోదరకవులిన్ని గ్రంథాలు రచించినా వందల సభలలో పాల్గొని అష్టావధాన, శతావధానాలు కావిస్తూ పరిసర స్థితిగతుల్ని సుందరంగా, సుకుమారంగా వర్ణించినా, ఈనాటి సాహితీ ప్రపంచంలో వారికి ముఖ్యంగా యువతరంవారికి అంతంతమాత్రంగానే విదితం. ప్రధానంగా వారికి తమ ప్రవర్థమాన కాలంలో స్థిరమైన సంపాదన లేకపోవడం. తమ గ్రంథాలు ప్రచురణమొందకపోవడం, ప్రచారం కావించుకోకపోవటం, కృతిస్వీకర్తల గృహాలలోనే కొన్ని కొన్ని వ్రాతప్రతులు వెలుగు చూడకే అంతరించిపోవటం. నిరంతరం వారిని వెంటాడిన వారి దుర్భర దరిద్రం కారణంగా చెప్పవచ్చు.

(తరువాయి 25 వ పేజీలో)

త్యాగరాజ నమోస్తుతే

మునుపు ప్రేమగల దారవై- సదా చనువునేలినది, గొప్పగా దయా కనికరంబున- నా కరముబట్టు శ్రీరామా!!

త్యాగరాజు శ్రీరామునికి నివేదించినదే- యీ రోజు ఇనకులేశుడైన శ్రీ వేంకటేశునికి నివేదిస్తున్నాను. ఆయన - వినా నాకెవరున్నారు?

మునుపు కరుణను చూపి, ప్రేమ చూపించిన శ్రీ వేంకటేశుడు పరాకుగా ఉన్నాడా- అనే నా భావన:**మునుపు ప్రేమగల దొరవై- సదా చనువు నేలినది గొప్పగాదు- ఇప్పుడు నీ దయ చూపుము!**

ఇనకులాప్తుడవు నీవని అడుగుతున్నాను. ఇంకెవరున్నారనడుగగలను? ఆనంద హృదయుడవని అడుగుతున్నాను. అభయప్రదాతవని అడుగుతున్నాను. మనసులో ఉన్న మదన తెలుసుకో, మరకతాంగుడవని అడుగుతున్నాననుకో!

బలములేని కలిమేమి ఫలం కలి మదమునణచుట కేతెంతిన కౌసల్యపుత్రా - యని త్యాగరాజు ప్రశ్నించడము సబబుగానే ఉంది. అది నాకూ అన్వయించినట్లుగానే ఉన్నది. ఆయన వ్రాసి ఆలపించినవి ఎన్ని ఆర్తి గీతాలో! ఎన్ని ఆత్మార్పణ గీతాలో! అందుకే ఆ రాగరాజును త్యాగరాజని అన్నారు!

మునుపు జవసత్వాలున్నప్పుడు కరుణ చూపి వృద్ధత్వముతో కృద్ధుడనగుతున్న నాకు తోడుగా ఉండమనడం సమంజసమే!

వృద్ధాప్యం కావచ్చు, మానసిక వొత్తిడి కావచ్చు, దానికి మందు, మాకూ ఏదీ అవసరం లేదు, సభక్తీ పూర్వకంగా ఇష్టమైన దైవమును ఏకాగ్రచిత్తంతో ప్రార్థిస్తే ఆ పరంధాముడు ప్రశాంతత చేకూరుస్తాడు.

రామభక్తిపరులైన రామదాసూ, త్యాగరాజులు, వారు రామనామస్మరణంతోనే జీవితాలు గడిపారు. ఆ రామునొకణ్ణే మదిని నిల్పుకున్నారు. ఆర్తులు తమ ఆక్రందనలన్నిటినీ ఆలకింపచేసే కీర్తనలతోనే చెప్పుకున్నారు.

నాకు కీర్తనం రాదు, సంకీర్తనం చేయలేను. తదేక జ్ఞానంతో కొలువలేను. రామభక్తికి దూరం కాలేదు. ఆయన జన్మించిన పునర్వసూ నక్షత్రంలోనే పుట్టాను. శ్రీరామ ప్రభువునామాన్నే నా పెద్దలు పెట్టారు. వరిధనంలోని మా యింటి ముందు గల శ్రీరామాలయం పునర్నించడంలో నేనూ ఉడతలా తోడ్పడ్డాను. రాముని అనుగ్రహంతో 'ఆధ్యాత్మరామాయణం' గ్రంథానికి ఆంధ్రాను వాదం చేసాను. లేపగానే, స్నానాన్తరం 'శ్రీరామరక్షతు' అనుకుంటాను. ఇంతకన్నా - నేనేమీ అధికంగా చేయలేదు.

శ్రీరామ చంద్రా! కరుణాసాంద్రా! మునుపు నాపై ప్రేమగల దొరవై, చనువున నేలినది కాదయ్యా! ఇప్పుడీ వృద్ధ దశలో నాకరముబట్టి కనికరముతో నడిపించు, నీవు నా కరముబట్టి నడిపించిన, చేతికర్ర అవసరం నాకేఁవుంది? తొమ్మిది పదులవరకూ ఎందర్నో నడిపిస్తున్నావే!

ప్రముఖాంధ్ర రజితోత్సవ సంచికవరకైనా కనికరంతో నీ కరమును ఊతగా అనుగ్రహించు.

(గోటేటి జన్మదినం సందర్భంగా)

(24 వ పేజీ తరువాయి) వారు వ్రాసిన గ్రంథాలను విషయపరంగా విడదీస్తే పౌరాణికములు, చారిత్రకములు, సాంఘీకములు, మహాపురుషుల జీవిత చరిత్రలున్నాయి. శైవమతానికి సంబంధించిన శ్రీశైల ఖండం, నీలకంఠేశ్వర శతకం, నీలలోహిత శతకం, కుమార విజయం, పార్వతీ కుమార సంభవం గ్రంథాలున్నాయి.

ఏ కవి యేకథ వ్రాసిన
లోకమునకు వలయు నీతులున్, ధర్మములున్
బ్రాకునటు వ్రాయవలయుం
గాక తదన్యంబు మేలు గల్గించునొకో
అనిన వీరభద్రాచార్యులుగారి ఆత్మ ప్రత్యయం....
ప్రాచీనాంధ్ర కవిత్వ తత్వ విధులం బాటించి నాకున్న వి
ద్యా చాతుర్యము, జూపి యీ చరిత వ్రాయం బూనితిన్, వీరభ
ద్రాచార్యుండను కన్నెకంటి కులుఁడన్ ధాత్రీజన స్తుత్యమై
యా చంద్రార్కము వెల్గుగాత మిది యుద్యత్ కీర్తి సాంద్రమ్ముగన్

అనే పద్యం మూలకంగా ద్యోతకమవుతుంది.

"ప్రజలకుందదగిన పద్ధతుల్ పాత్రల
వలన, వారి కథల వలన ఁదెల్పు
కవి వరుండు, కాన కావ్యమెయ్యది యైన
జదువవలయు నీర్ష్య వదల వలయు"

అనునది వీరి అభిమతం. వీరు వ్రాసిన పార్వతి పద్యకావ్యానికి ' ఈ రచన యమృత వాహినిగా నున్నది. మాధుర్యమే సర్వాక్షర సన్నివేశమున దొణుయచున్నదని 'మెచ్చుకోలు నందించారు విశ్వనాధవారు. ఏ విధమైన వ్యంగ్య మర్యాదలకు పాల్పడకుండా నీలకంఠేశ్వర శతకం, నీలలోహిత శతకం, స్తోత్రమంజరి, కుమార విజయం, కుమార సంభవం వాని వాని ప్రత్యేకతలను అవి సంతరించుకున్నవి.

పౌరాణికములలో వైష్ణవ విభాగానికి చెందినవిగా శ్రీ సత్యనారాయణ చరిత్ర, వేంకట రమణ శతకం, వేంకట రమణస్తుతి, ఆంజనేయ శతకం, కోదండరామ శతకం, అటుకుల మూట, శ్రీకృష్ణ పారిజాతం, శ్రీ కృష్ణ తులాభారం పేర్కొనదగి ఉన్నవి. అయితే వీటిలో శిఖర ప్రాయం అటుకుల మూట. ఇది పోతనామాత్యుని కుచేలోపాఖ్యానమనకు మానసపుత్రిక. కుచేలోపాఖ్యానం భాసురమైన ఉపాఖ్యానం. అటుకుల మూట సురుచిర సుందర ఖండ కావ్యం. కుచేలోపాఖ్యానం కుచేలుని ఉపాఖ్యానమే యైనను కృష్ణుని గొప్పతనము వర్ణించబడినది. అటుకుల మూట కుచేలుని గొప్పతనమునకుదాహరణం. మార్గమధ్యమున కుచేలుడు చూచిన, మాట్లాడిన గోపబాలకుల వృత్తాంతం, ద్వార పాలకుల చెంత సామాన్యులు పడెడి యిక్కట్లు, అంతఃపుర స్త్రీలచే కుచేలునికి జరిపిన పరిచర్యలు ఈ కావ్యంలో సరళ శోభితం.

(డా॥ చిట్టిప్రోలు సుబ్బారావు గారి పరిశోధక వ్యాసం కారణంగా ఈమాత్రం చరిత్ర తెలిసింది)

అమ్మ గురించి, నాలుగు ముక్కలు ప్రతి ఏప్రిల్ లోను రాయడం నాకు ఆనవాయితీగా వుంది అంటే సంవత్సరానికొకసారే అమ్మని గుర్తుంచుకుంటానా లేదా మొక్కుబడిగా నాలుగు గీతలు గీసేస్తానా? అదీ కాదు నాకు సర్వస్వం అమ్మే. నేనిప్పుడు ఇలా ఉండడానికి కారణం అమ్మే. మా ఇంటి హాలులో, నా ఆఫీసులో నా ప్రక్కన, నా కారులో అమ్మ ఫోటో పెట్టుకుని వుంటాను. అది నాకో తృప్తి అప్పుడప్పుడూ మాట్లాడుతూ వుంటాను. ఇవన్నీ చూసి నవ్వేవారున్నారు, వెక్కిరించేవారున్నారు. అవన్నీ నేను పట్టించుకోను. మహాజ్ఞాని సాక్షాత్ శివాంశ సంభూతులైన శంకరాచార్యులవారు జగన్మాతను 'నిత్యానందకరీ' అన్నారు. నిజమే కాసేపు అమ్మను తలుచుకుంటే అదేదో తెలియని ఆనందం కలుగుతుంది. అప్పటి విషయాలన్నీ గుర్తుకువస్తాయి. ప్రతి తల్లికి ప్రేమ సహజం. అమ్మకు ప్రేమించటం తప్ప ద్వేషించటం తెలియదు. మాట కటువుగా వుంటుంది. కారణం బిడ్డలు ఎక్కడ దారి తప్పుతారో అని ఆరాటం. తల్లి తన బిడ్డ బాగుండాలనే చూస్తుంది. తనలోంచి ప్రాణం పోసుకుని పుట్టిన బిడ్డను ప్రాణపదంగా చూసుకుంటుంది. వారికి కష్టం వస్తే, తను ఏడుస్తుంది. వారికి సంతోషం వస్తే తను నవ్వుతుంది. అహర్నిశం వారి బాగోగులే ఆలోచిస్తుంది. బిడ్డలు బాగుండాలి. వారికే కష్టం రాకూడదు. అలాగే మా అమ్మ కూడా. మాది అతిసాధారణ మధ్యతరగతి కుటుంబం. మధ్యతరగతి అంటే తినడానికి నాలుగు గింజలు, కట్టుకోడానికి రెండు గుడ్డ పీలికలు అలా వున్న కుటుంబాన్ని మా అమ్మ, నాన్నలు కష్టపడి, శ్రమపడి వారు సుఖపడకుండా పిల్లల రేపటి జీవితం బాగుండాలని పైసా పైసా వృధా కానీయకుండా కూడబెట్టి పెంచారు. అందులోను మా అమ్మకు రేపు ఇలా ఉండాలి అన్న ఆలోచన వుండేది. మెల్లగా ఒక ఇల్లు, చిన్న కారు, అన్నదమ్ములు అందరూ కలిసి ఒకే ఉమ్మడి కుటుంబం. అలాగే వున్నాం. అప్పుడు ఇలాగే వున్నాం, ఇప్పుడు ఇలాగే వున్నాం. మా అభ్యున్నతి కోసం పూజలు, నోములు, వ్రతలు ఎన్నెన్నో! అందుకనే దేవుడు ప్రతి ఇంటిలోను తాను వుండలేనేమోనని అమ్మను సృష్టించాడు. అందుకనే శంకరులు "కుపుత్రో జాయతీ క్వచిదపి కుమాతో న భవతి" అంటారు. అంటే చెడ్డ పుత్రుడుండవచ్చుగాని చెడ్డ తల్లి వుండదు అని అర్థం.

అందుకే దేవుడు పంపించిన దేవత అమ్మ
బహు దండిగా అమ్మ అండదండలుండాలని
అమ్మ చరణములకు నమస్కరిస్తూ, ఆశీస్సులీయవమ్మా అని వేడుకుంటున్నాను.

* * *

దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్నారు గురజాడ. ప్రస్తుత ప్రభుత్వం వచ్చి ఇంకా సంవత్సరం పూర్తి కాలేదు. వారిపై ప్రజలకు ఎన్నో ఆశలున్నాయి. అందువల్లే వారిని గెలిపించారు. వారు ఆసనాల్లో ఆశీనులై కొంత కొంతగా పనులు ప్రారంభించారు. ఇంతలోనే అసంతృప్తి, లోక్‌సభ, రాజ్యసభల నుండి వాకౌట్లు. సేనాని లేకుండా పోరాడుతోంది కాంగ్రెస్, ఆ కాంగ్రెస్ పార్టీకి పదవి లేకపోతే నీళ్ళలో లేని చేపలా విలవిలలాడిపోతుంది. మిగిలిన చిన్న చితకా పార్టీలన్నీ ఎటూ పాలుపోక, ఏం చెయ్యాలో తెలియక కేవలం అసూయ, ద్వేషంతో పనిచేస్తున్నాయి. ఇక మైనారిటీలు మమ్మల్ని కలుపుకోలేదు అంటూ ఒకప్రక్క సణుగుడు. అసలు మెజారిటీలను ఎవన్నా పట్టించుకున్నారా? లేదా మెజారిటీలకు ఎవన్నా రాయితీలు కల్పించారా? ముసుగులో గుద్దులాట ఎందుకు? నిజమే మాట్లాడుకుందాం. ఇంతవరకు హిందువులకు అంటూ ఏవన్నా ప్రణాళికలు, రాయితీలు కల్పించారా. కనీసం భగవద్గీతను జాతీయ గ్రంథం చెయ్యలేకపోయారు. అంతమాత్రం చేత హిందువులు అసంతృప్తి చెంది ధర్నాలు చేసారా? పోని హజ్ సబ్సిడి తగ్గించి కాశికి వెళ్ళేవారికి ఏదైనా రాయితీ ప్రకటించారా? గ్యాస్ సబ్సిడి అకౌంటులో పడగానే ఎంతమంది ముఖాలు వెలిగిపోయాయో? ఇంతవరకూ ఏ ప్రభుత్వమన్నా ఇలా చేసిందా? 'స్వచ్ఛభారత్' అన్నారు. ఇందులో ఏమన్నా కులం, మతం వుందా, శుచిగా, శుభ్రంగా వుండమనేగా దీని అర్థం. "మేకిన్ ఇండియా" దేశంలోనే వస్తువులు తయారుచేస్తూ విదేశాలకు ఎగుమతి చేద్దాం అన్నారు. ఇందులో ఏమన్నా కులం, మతం వుందా? అరవై ఏళ్ళ పాలనలో ఏమి సాధించాము. ఈ ఐదేళ్ళలో ఏమి పోగొట్టుకుంటాం. అయిదేళ్ళు ప్రభుత్వం నడిచాక ప్రజలు నిర్ణయిస్తారు. వారుండాలా, వెళ్ళాలా అని అంతవరకు అసూయా, ద్వేషాలను ప్రక్కన పెట్టి కాస్త ఓపిక వహిద్దాం. వారికి తెలుసు దొరికిన స్వర్ణావకాశం దీనిని పోగొట్టుకుంటే కష్టమని. కాబట్టి Lets us Wait and watch.

* * *

దున్నపోతా!
అని ఎంత అందంగా పద్యంలో తిట్టచో

నగపగతు పగతు పగతుని
పగతుండగు మగధరాజు బరిమార్చిన యా
జగజెట్టి యన్న తండ్రికి
దగు వాహనమైన యట్టి ధన్యుండితడే!

నగ పగతుడు - ఇంద్రుడు, అతని విరోధి - నరకుడు,
వాని విరోధి - కృష్ణుడు, అతని విరోధి - జరాసంధుడు,
అతనిని చంపినవాడు భీముడు, అతని అన్న - ధర్మరాజు,
అతని తండ్రి - యమ ధర్మరాజు అతని వాహనము - దున్నపోతు; అని అర్థం.
చూసారా తిట్టా, పొగడ్తా అని తెలియకుండా ఎంత చక్కగా దున్నపోతా అని తిట్టచో!

* * *

దేవుడి ప్రార్థనలో వినోదం!

ఓకాయన శివుని ఇలా ప్రార్థించాడట.

హిమగిరి తనయా హిమాంశులేఖా
సరిదతి శీతలా వాహినీ సురాణాం
త్రిభిరేతైరతి వేసి తో2సి శంభో
మమహృది వివిధ త్రి తాపతస్తే

- ఓ పరమశివా! మీ సమీపంలో శీతల వస్తువులన్నీ వచ్చి చేరాయి, మీ ధర్మపత్ని - హిమవంతుని కుమార్తె (హిమాలయాలు), మీ శిరస్సుపై చంద్రుడు - చల్లనివాడు, మీ జటాజూటంపై గంగ - స్వచ్ఛానికి చల్లని నీరుకి పెట్టింది పేరు - ఇలా శీతల వస్తువులన్నీ మీవద్ద వుండడంవల్ల మీ ఆరోగ్యరీత్యా ఏ మార్పు కలగకుండా, మహాప్రభో నా చిన్న సూచనను ఆలకించండి - నా హృదయం తాపత్రయంతో కూడి ఉంది. ఆధ్యాత్మిక తాపం, ఆదిభౌతిక తాపం, ఆది దైవిక తాపం నా మనసులో చోటుచేసుకుని, ఈ మూడుతాపాలతో నాలో ఉష్ణం (వేడి) ఎక్కువయ్యింది. కాబట్టి ఓ దేవాదిదేవా మీరు నా హృదయంలో వచ్చి కాపురం వుంటే అంతా సవ్యంగా జరిగి నాకు శాంతి కలుగుతుంది. నేను ధన్యుణ్ణి అవుతాను అంటూ ప్రార్థించాడు.

చూశారా ఆ భక్తుడి చమత్కృతి, మన భాషలోని గొప్పతనం.

సరిగ్గా ఇలాటివే ఎక్కడెక్కడనుంచో సేకరించి మన తెలుగు భాష చక్కందనాన్ని చాటి చెప్పడమే మా నాన్నగారు "ప్రముఖాంధ్ర" ద్వారా గత ఇరవై సంవత్సరాలుగా చేస్తున్నారు. తెలుగువాడికి తెలుగు తెలియదు అనడం తన కన్నతల్లి ఎవరో తనకే తెలియకపోవడంతో సమం. మీ పిల్లలకు తెలుగు నేర్పడం ప్రతి తల్లి తండ్రి బాధ్యత, బాధ్యతారాహిత్యంగా వున్నామనే అపవాదు మనకొద్దు, తెలుగు భాష మనకు ముద్దు.